క్లుప్తంగా

కొత్త రేషన్ కార్డుల పంపిణీ



రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న నేతలు

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ 19వ వార్డులో ఇటీవల మంజూరైన నూతన రేషన్ కార్డులను ఆ వార్డు కౌన్సిలర్ శ్రీలక్ష్మి, నాయకలు శుక్రవారం పంపిణీ చేశారు. అర్హులై ఉండి ఎవరికైనా సాంకేతిక కారణాల మూలాన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని పక్షంలో సచివాలయంలో సంప్రదించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



రొంపిచెర్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రొంపిచెర్ల పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల కథనం..గురువారం రాత్రి గానుగచింతలో గస్తీ తిరుగుతున్న పోలీసులకు అన్నమ్మయ్య జిల్లా పింఛా ఏటి నుంచి రొంపిచెర్ల వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్లు ఎదురు పడ్డాయి. పరిశీలించగా ఇసుక రవాణాకు అనుమతి లేదని తేలడంతో వాటిని సీజ్ చేసినట్టు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

'మానసిక ఆరోగ్యం ముఖ్యం'



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉదయ్ కిరణ్

చౌడేపల్లె: మానసిక ఆరోగ్య సేవల కోసం అవసరమైన రోగులు ప్రభుత్వం కేటాయించిన 14416 టోల్ ఫ్రీ నంబరు సేవలు పొందవచ్చని న్యూరో సైక్రియాసిస్ట్ డాక్టర్ ఉదయ్ కిరణ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మానసిక ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించి 30 మంది రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మానసిక జబ్బులకు ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందితే వాటి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. దీర్ఘ కాలంగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారు మదనపల్లె జిల్లా ఆసుపత్రి, చిత్తూరు జిల్లా ఆసుపత్రి, తిరుపతి రూయాలో చికిత్స పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు పవన్‌కుమార్, పూజ, సోషల్ వర్కర్ యాసిన్ రాజా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు స్వామి వివేకానంద ఆదర్శం



వివేకానంద చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న లైబ్రేరియన్ తదితరులు

పలమనేరు: యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద 161వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి, ప్రిన్సిపల్ మాట్లాడారు. యువత సన్మార్గంలో పయనించేందుకు ఆయన ఉపన్యాసాలు, రచనలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. భారతదేశ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు వివేకానందుడని కీర్తించారు. ఇదే కార్యక్రమాన్ని పట్టణంలోని శాఖా గ్రంథాలయంలోనూ నిర్వహించారు. లైబ్రేరియన్ హేమకుమార్, జనార్ధన్ పాల్గొన్నారు.

నేడు క్రికెట్ టోర్నమెంట్

శాంతిపురం: గుండిశెట్టిపల్లె యూత్ ఆధ్వర్యంలో ఒక్కరోజు డే అండ్ నైట్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే టోర్నీ నిరంతరాయంగా కొనసాగేందుకు ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. విన్నర్స్, రన్నర్స్ జట్లకు రూ 22,222, రూ 11,111, మూడవ బహుమతిగా రూ 5,555ల నగదుతో పాటు ట్రోఫీలను అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 91103 09966 నంబరును సంప్రదించాలని కోరారు.

మత్స్య సంపదతో ఆర్థికాభివృద్ధి

బంగారుపాళెం: మత్స్యకారులు చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. మండలంలో గుంతూరు సమీపంలోని వెంకటప్పనాయుని చెరువులో శుక్రవారం ఎఫ్‌డీఓ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏపీ మత్స్యసంస్థ 40 వేల చేపపిల్లలు, పీఎం సమృద్ధి మత్స్య సంస్థ ద్వారా 6,500 చేప పిల్లలను వదిలిపెట్టారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకునేందుకు కృషి చేస్తోందని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ గౌరి, గంగపుత్ర సహకార సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజ, ఉమాపతి, సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం దేశానికే తలమానికం

- ఈనెల 19 చరిత్రలో నిలిచిపోయే రోజు
- నేటి నుంచి వారం పాటు అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు
- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: రాష్ట్రంలోని విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల ఎత్తు కలిగిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు దేశానికే తలమానికంగా నిలుస్తుందని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. ఈనెల 19న విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన నియోజకవర్గంలోని బహుజనులు, ప్రజాప్రతినిధులు, దళిత నేతలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, దేశ తొలి న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగశిల్పి, ఆర్థిక శాస్త్రవేత్త, సంఘ సంస్కర్త, కులవివక్ష నిర్మూలనకు పాటుపడిన అంబేడ్కర్ బాటలో ప్రస్తుత సమాజం పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను స్మరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూ.404 కోట్లతో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, దీంతో పాటు స్మృతివనం ఏర్పాటు చేసి ఆయన త్యాగాలను నేటితరం గుర్తుకుతెచ్చుకునేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేయడం చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. ఈనెల 19న విగ్రహావిష్కరణ వరకు ఆయన సేవలను స్మరిస్తూ నియోజకవర్గంలో అన్ని అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులు అర్పిస్తూ ఓ పండుగలా కార్యక్రమాలను చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి -నివాళులర్పించిన ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ దిగువ కల్లాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోవిందురెడ్డి మృతి చెందడంతో ఎమ్మెల్యే వెంకటేగౌడ మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి శుక్రవారం ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రక్తదాన శిబిరానికి మంచి స్పందన



రక్తదానం చేస్తున్న యువకుడు

పలమనేరు: ఈనెల 19న విజయవాడలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. పలువురు యువకులు రక్తదానం చేశారు. డాక్టర్ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను అందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అన్నారు. పట్టణ మాజీ కన్వీనర్ మండీ సుధా, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమష్టి కృషి చేస్తే అధికారం మనదే



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్, వేదిక మీద ఎంపీ రెడ్డెప్ప, పార్టీ నాయకులు

- సైనికుల్లా పనిచేస్తే లక్ష్యం సాధ్యం
- ప్రజలను మరోసారి వంచిస్తున్న చంద్రబాబు
- జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు భరత్

గుడుపల్లె: క్షేత్రస్థాయి నుంచి కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తే ఎన్నికల్లో అనుకున్న లక్ష్యం సాధించవచ్చని, మరోసారి వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం తథ్యమని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ రాళ్లగంగామాంబ ఆలయం వద్ద పార్టీ కార్యకర్తలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీతోపాటు ఎంపీ రెడ్డెప్ప మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు ప్రవేశ పెట్టి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ వలంటీర్ల వ్యవస్థతో అందించారన్నారు. కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబం పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి ఓట్లను అభ్యర్థించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి సాక్షాత్తు చంద్రబాబే.. ఎవరు హామీలు ఇచ్చారు? మీకు ఎవరు చెప్పారు? అని ప్లేటు ఫిరాయించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్నికల నేపథ్యంలో బాబు ష్యూరిటీ అని కరపత్ర ప్రచారానికి తెరదీశారని, ఈ ష్యూరిటీ హామీలు ఎన్నికల సమయంలో మభ్య పెట్టేందుకేనని ప్రజలు గుర్తెరగాలని విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. కుప్పంలో కూడా తమ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరో రెండు నెలలు అందరూ కృషి చేస్తే వచ్చే ఐదేళ్లలో ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ మునస్వామి, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆదరించండి



చీరలు పంపిణీ చేస్తున్న దుర్గమ్మ

శాంతిపురం: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ కోరారు. శుక్రవారం ఆమె నక్కనపల్లె, చింతగంపల్లె, గుంజార్లపల్లె, టి.కొత్తూరు, బొమ్మనపల్లె, కరేగొనూరు గ్రామాల్లో పర్యటించారు. సంక్రాంతి సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మహిళలకు చీర, పసుపు కుంకుమలను అందజేసి మాట్లాడారు. కరోనా కష్ట కాలంలో కూడా తన భర్తతో పాటు కుటుంబం అంతా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలు అందించామన్నారు. తన భర్త నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికే కృషి చేస్తున్నారని, వైఎస్సార్ సీపీకి రాబోవు ఎన్నికల్లో పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, నాయకులు సోమారెడ్డి, సంపంగి, కోదండరెడ్డి, చలపతి, వెంకటప్ప, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



రొంపిచెర్ల: గానుగచింతలో పశు వైద్య శిబిరంలో దాణా పంపిణీ చేస్తున్న అధికారులు



మంగళంపేటలో పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మధు

రొంపిచెర్ల: వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి శ్రీధర్ కోరారు. శుక్రవారం గానుగచింత గ్రామ పంచాయతీ మారంరెడ్డిగారిపల్లెలో వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. 68 పశువులకు పిడుదల నివారణకు మందు పిచికారీ చేశారు. అలాగే 36 దూడలకు నట్టల నివారణకు మందులు ఇచ్చారు. దాణా పంపిణీ చేశారు. పాడి ఆవులకు ఫలం సూదికి రూ.40 మాత్రమే రైతులు చెల్లించాలని పశు వైద్యాధికారి తెలిపారు. ఈ నెలాఖరు లోపు గానుగచింత, బండకిందపల్లె, పెద్దగొట్టిగల్లు వాటర్‌షెడ్ పరిధిలో 16 పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హేమలత, ఎంపీటీసీ రమణమ్మ, వాటర్‌షెడ్ చైర్మన్ చంద్రయ్య నాయుడు, పశు వైద్య శిబ్బంది మోహిత్, అల్తాఫ్‌బాషా, నందకుమార్, రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.

రెండు పంచాయతీల్లో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేట, పాళెం పంచాయతీలలో శుక్రవారం వాటర్‌షెడ్, పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించాయి. పశువులలో పిడుదుల నివారణ, గర్భకోశ వ్యాధులకు మందులను పాడిరైతులకు పంపిణీ చేశారు. డాక్టర్ మునిచంద్ర, సర్పంచ్ మధు, వాటర్‌షెడ్ జేఈ తేజ, టీఓలు షబ్బీర్, దొరైరాజ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



జేసీబీతో చేస్తున్న మట్టి రోడ్డు చదును పనులు

శాంతిపురం: కర్లగట్ట వద్ద ఉన్న ద్రౌపదీ సమేత శ్రీ ధర్మరాజులస్వామి ఆలయానికి సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. దాదాపు 400 మీటర్ల రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం రూ.20 లక్షలను మంజూరు చేసినట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి తెలిపారు. రాళ్లబూదుగూరు రోడ్డు నుంచి కర్లగట్టకు వెళ్లే తారు రోడ్డు నుంచి ఆలయం వరకూ మట్టి చదును పనులను ఆయన ప్రారంభించారు. ఇదలా ఉంచితే, ఈ పురాతన ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ. 1.10 కోట్లు కేటాయించడంతో పనులు సాగుతున్నాయి.

ఆర్థిక సాయం



కుప్పం రూరల్: కుప్పం మండలంలోని ఊరునాయునిపల్లెకు చెందిన నరసింహులు (70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ మృతుని కుటుంబానికి స్థానిక నాయకులు కదిరివేలు, గోవిందు, లక్ష్మమ్మ, సోమమూర్తి, శేఖర్, గణపతి ద్వారా రూ.10వేలను అందజేశారు. మృతుని కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా



పనులను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

సదుం: మండలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవ చూపుతున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మండలంలోని తాటిగుంటపాలెంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో అధికారులు టెక్నికల్ చార్జింగ్ పనులను శుక్రవారం పరిశీలించారు. నూతన్ సబ్‌స్టేషన్ల నిర్మాణంతో విద్యుత్ సమస్యలు తీరనున్నట్టు పెద్దిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, ట్రాన్స్‌కో డీఈలు శ్రీనివాసమూర్తి, దామోదర, మహేశ్వర్‌రెడ్డి, ఏడీ నరేంద్ర, నాయకులు గిరిధర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, శివారెడ్డి, దేవేంద్రరెడ్డి, రమేష్‌రెడ్డి, ఇమ్రాన్, పుత్రాజు తదితరులు పాల్గొన్నారు.

342మందికి వైద్య పరీక్షలు

- జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాలకు మంచి స్పందన



పెద్దపంజాణి: రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

పులిచెర్ల(కల్లూరు): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా మెరుగైన వైద్యసేలందించడమే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని మతుకువారిపల్లె పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరంలో 342 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం నూతన ఆరోగ్యశ్రీ కార్డులు, కళ్లద్దాలను అందజేశారు. కల్లూరు పీహెచ్‌సీ మెడికలాఫీసర్ డాక్టర్ జానకీరావు, ఎంపీటీసీ ఉషారాణి, హెల్త్ సూపర్‌వైజర్ శారద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

89 పెద్దూరులో 254 మందికి..

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు పంచాయతీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరం నిర్వహించారు. మొత్తం 254 మందికి బీపీ, షుగర్, కీళ్ల పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్టు వీర్నమల పీహెచ్‌సీ వైద్యాధికారి శశిధర్ తెలిపారు. కార్యక్రమంలో గైనకాలిజిస్ట్ హరిత, ఆర్థోపెడిక్ రాజు, సర్పంచ్ మల్లిక, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, వైస్ సర్పంచ్ పార్వతమ్మ, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మణి, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దకాప్పల్లెలో 215మందికి..

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లె ఎంపీయూపీ పాఠశాలలో శుక్రవారం సర్పంచ్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం-2 లో 215 మందికి వైద్యాధికారులు తమన్నాజ్, గ్రీష్మబిందు, మౌనిక, నందిని వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కళ్లద్దాల కోసం 26 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌ఆర్డీ శారదాదేవి, వైద్య ఆరోగ్య శాఖ సలహాదారు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ పావని, వైస్ సర్పంచ్ ఆంజిరెడ్డి, పీఎస్ విశ్వమాలిని, ఎంఆర్సీ సుధాకర్, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏ.కొత్తకోటలో 264 మందికి..

చౌడేపల్లె: మండలంలో ఏ.కొత్తకోట సచివాలయ సమీపంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరంలో 264 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీపీ రామమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు తెలిపారు. అనంతరం కళ్లద్దాలు, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ అంజిబాబు, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, ఎంపీటీసీ శ్రీరాములు, సర్పంచ్ రిజ్వానా, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, ఎంపీటీసీ నాగరత్న, ఎంపీడీఓ సుధాకర్, డాక్టర్ పవన్ కుమార్, పూజ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గద్దూరులో..

బైరెడ్డిపల్లె: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. మండలంలోని గద్దూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్, శాలిని రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, పార్టీ మండల కన్వీనర్ కార్తీక్, సర్పంచులు చంద్రమౌళి, దేవేంద్రరెడ్డి, ఎంపీటీసీ వినాయకం పాల్గొన్నారు.



పులిచెర్ల: మతుకువారిపల్లెలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్



రామకుప్పం: రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



చౌడేపల్లె: ఏ.కొత్తకోటలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఆడుదాం ఆంధ్రా క్రికెట్ విజేత కీలపట్ల



గంగవరం: షీల్డ్స్ చూపుతున్న విజేతలు



పలమనేరు: బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



రామకుప్పం: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



శాంతిపురం: క్రికెట్ విజేతగా నిలిచిన జట్టు

- పలుచోట్ల ముగిసిన క్రీడా పోటీలు

గంగవరం: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రువారం ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన మండల స్థాయి పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. సాయిబాబా ఆలయ సమీప మైదానంలో జరిగిన క్రికెట్ పోటీలను మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నాయకులు చంద్రప్ప ప్రారంభించారు. క్రికెట్ టోర్నీ ఫైనల్స్‌లో కొత్తపల్లెపై కీలపట్ల జట్టు విజయం సాధించింది. ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి షీల్డ్స్, మెడల్స్ విజేతలకు ప్రదానం చేశారు.

పలమనేరులో..

పలమనేరు: ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి పోటీలు శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానంతోపాటు కొన్ని క్రీడలు ఇండోర్ కోర్టులో నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ ఆటల్లో గెలుపొందిన మొరం, టీఎస్ అగ్రహారం, పాతపేట-2, సముద్రపల్లె జట్లు నియోజకవర్గ పోటీలకు ఎంపికైనట్టు ఎంఈఓ-2 బాలసుందరం తెలిపారు. మిగిలిన పోటీలను ఈనెల 17 నుంచి 19 వరకూ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో వివిధ పోటీల్లో తమ సత్తా చాటుతున్నారు. ప్రధానంగా కబడ్డీ, క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

మండల క్రికెట్ విజేత రాళ్లబూదుగూరు

శాంతిపురం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మండల స్థాయి విజేతగా రాళ్లబూదుగూరు జట్టు నిలిచింది. శనివారం చిన్నారిదొడ్డి వద్ద కెనమాకులపల్లె జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రాళ్లబూదుగూరు జట్టు గెలుపొంది నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఆ జట్టును ఎంపీటీసీ రమేష్ అభినందించారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



బంగారుపాళెం ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న లక్ష్మీప్రసన్న

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం సాయంత్రం వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. డీఆర్‌సీ ఏఓ లక్ష్మీప్రసన్న పలు దుకాణాల్లో రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, దుకాణ యజమానులు రైతులకు నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన ఎరువులు, మందులను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. నిబంధనల మేరకు నడుచుకోని దుకాణ నిర్వాహకుల లైసెన్సులను రద్దు చేసామన్నారు. ఏఓలు భారతి, చిట్టిబాబు, ఏఈఓ సాదరయ్య పాల్గొన్నారు.